జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 1-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 87 పేజీలు: 8 వెల : రూ.7

# ఎస్పీ కార్యాలయంలో.. నాటుకుపోయిన.. సి.. నంబర్స్

* కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన అటాచ్‌మెంట్ పోలీసులు
* పోలీసు అధికారులు, రాజకీయ నేతల సిఫార్సు లేఖలతో జిల్లా పోలీసు కార్యాలయంలోకి..
* ఇక్కడ పనీపాట లేక ఖాళీగా ఉన్న సి నంబర్స్
* పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత
* నైట్‌బీట్లు సక్రమంగా జరగని కారణం
* ఇటీవల అటాచ్‌మెంట్లు రద్దు చేసిన జిల్లా పోలీస్‌బాస్
* ఇంకా చాలామంది ఎస్పీ కార్యాలయంలోనే విధులు

**శ్రీకాకుళం క్రైం, జులై31 (వార్త):** అనారోగ్యం పేరిట కొందరు.. దూర ప్రాంతాల్లో పనిచేయలేక మరికొందరు.. జిల్లా కేంద్రంలోనే ఉండాలని ఇంకొందరు పోలీసులు జిల్లా పోలీసు అధికారులు, రాజకీయ నేతలతో సిఫార్సు లెటర్లు తెచ్చి రికమెండేషన్ చేయించుకుని జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఉద్యోగం వేయించుకుంటున్నారు. ఇలా సుమారు 150 నుంచి 180 మంది వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎటువంటి పనీ పాట ఉండదు. ఎంచక్కా వస్తారు. ఉన్నతాధికారులకు ఒక సెల్యూట్ కొట్టి.. మళ్లీ తమ ఇళ్లకే పరిమితమవుతున్నారు కొందరు. సివిల్ డ్రెస్‌లోనే ఉంటారు. యూనిఫారం ఊసే ఉండదు. ఎవరైతే పోలీసు ఉన్నతాధికారులు తమకు సిఫార్సు పత్రం ఇచ్చి అటాచ్‌మెంట్ చేశారో వారికి కృతజ్ఞతాభావంతో ఉంటారు. వీరి సేవలు ఆ అధికారి ఇంటివద్దే అధికంగా ఉంటుందని తోటి పోలీసులే చెబుతున్నారు. డీఎస్పీలు, సీఐలు ఇకపై పోలీసులను అటాచ్‌మెంట్ చేయవద్దని జిల్లా పోలీస్ బాస్ ఒక మెమోను కూడా జారీ చేశారు. గతంలో ఉన్న ఓ ఎస్పీ సుమారు 50 మంది పోలీసులను జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయానికి అటాచ్‌మెంట్ చేశారట. ఇలా పోలీసులను జిల్లా కేంద్రానికే అటాచ్‌మెంట్ చేయడం వల్ల పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. టెక్కలి, పలాస, నరసన్నపేట, ఇచ్ఛాపురం, తదితర మేజర్ పోలీస్‌స్టేషన్లలోనూ సిబ్బంది కొరత ఉంది. మెన్ లేకపోవడంతో రాత్రివేళ పోలీసు గస్తీ సక్రమంగా జరగడం లేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం అధికమవుతోంది. సెలవులు కూడా దొరక్క పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. కుటుంబానికి సైతం తగిన సమయం కేటాయించలేక సతమతమవుతున్నారు. ఇకనైనా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పందించి అటాచ్‌మెంట్ పోలీసులు ఏ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అవసరమో గుర్తించి, మిగతావారిని ఆయా పోలీస్‌స్టేషన్లకు పంపిస్తే బాగున్ను.. అని కొందరు పోలీసులు అభిప్రాయపడుతున్నారు.







## బదిలీలు షురూ

* 39 మంది తహశీల్దార్లకు పోస్టింగ్
* డీఎస్పీలకు బదిలీ
* నేడో రేపు సీఐలకు స్థానచలనం
* మరో వారం రోజుల్లో ఎస్ఐలకు..

## సహకార సంఘాల్లో... మెక్కినదంతా కక్కిస్తాం


* అవినీతి చేసిన సొమ్ము రికవరీ చేస్తాం * ఒక్క రోజులో రైతుకు రుణం మంజూరు * సహకార సంఘాల ద్వారా రూ.38.7 వేల కోట్ల రుణాలు * ఆప్కాబ్, డీసీసీబీల రుణ అంచనా ప్రణాళిక * రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి * ప్రతి జిల్లాలో ఆప్కాబ్, డీసీసీబీ బ్రాంచ్‌లు * రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

లోపలి పేజీల్లో

# విద్యాలయాల్లో.. మృత్యుఘోష

విద్యాలయాల్లో ఏం జరుగుతోంది.. విద్యార్థినులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.. అసలు కారణం ఏంటి? ఎవరి తప్పిదాలు వల్ల ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి? విద్యాశాఖాధికారులు ఏం చేస్తున్నారని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు నిలదీస్తున్నాయి. కోటబొమ్మాళి కేజీబీవీ భవనం మొదటి అంతస్తు నుంచి ఓ విద్యార్థి దూకిన ఘటన మరువక ముందే నందిగామ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం సృష్టిస్తోంది.





* కోటబొమ్మాళి ఘటన మరువక ముందే నందిగాంలో విద్యార్థిని ఆత్మహత్య
* అసలు విద్యాలయాల్లో ఏం జరుగుతోంది
* నందిగాం గురుకులంలో విద్యార్థిని అనుమానాస్పద మృతి
* తల్లిదండ్రులు రాకుండానే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించిన పోలీసులు
* పోలీసులు, గురుకులం అధికారులను నిలదీసిన తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు
* కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

3లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## చేసిన సేవలతోనే గుర్తింపు: ఎస్పీ



**శ్రీకాకుళం క్రైం, జులై 31(వార్త):** ఉద్యోగ నిర్వహణలో ప్రజలకు అందించిన, చేసిన సేవలు ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్పీ వి.ఉమా మహేశ్వరరావుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సిఐలు, ఇతర పోలీసు అధికారులు ఉమామహేశ్వరరావుకు దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ప్రేమ్ కాజల్, డి.గంగాధరం, డీఎస్పీలు త్రినాధ్‌రావు, శృతి, బాలచంద్రరెడ్డి, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసరావు, శేషాద్రి, ఏవో సీహెచ్ గోపినాథ్, సీఐలు, పోలీసు అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హడలెత్తిస్తున్న..

* ఎక్కడిక్కడ గోతులు * రిమ్స్ మీదుగా డే అంబేద్కర్ జంక్షన్ వరకూ ఆటోల ప్రయాణం * గోతుల రోడ్డులో బోల్తా పడుతున్న ఆటోలు * ప్రమాదాల బారిన ప్రయాణికులు * గోతులను పూడ్చని సంబంధిత అధికారులు

# శాంతినగర్ కాలనీ రోడ్డు







**శ్రీకాకుళం టౌన్, జులై 31 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని రిమ్స్ ఆసుపత్రి మీదుగా శాంతినగర్ కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. అడుగుకో గొయ్యి పడడం, వర్షం పడితే ఆ గోతుల్లో నీరు నిల్వ ఉంటోంది. ట్రాఫిక్ పోలీసుల ఆంక్షలతో ఆమదాలవలస, కొత్త రోడ్డు నుంచి వచ్చే ఆటోలు బలగ హాస్పిటల్ జంక్షన్, రిమ్స్, శాంతినగర్ కాలనీ మీదుగా అంబేద్కర్ జంక్షన్‌కు ప్రయాణికులను తరలిస్తుంటారు. ఈ రోడ్డులో ఒక్కో గొయ్యి అడుగు లోతు వరకూ ఉంటుంది. వర్షం పడి ఈ గోతుల్లో నీరు నిలిచిపోతూ ఉంటుంది. ఆటో డ్రైవర్లకు అక్కడ గొయ్యి ఉందన్న విషయం తెలియక రాకపోకలు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రూట్‌లో ఏదో ఒకచోట ఆటోలు బోల్తా పడుతునే ఉన్నాయి. ఇటీవల కొందరు ఆటో డ్రైవర్లు సొంతంగా గోతులను పూడ్చారు. వర్షాలు పడడంతో మళ్లీ గోతులుగా మారాయి. శాంతినగర్ కాలనీలోనే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా నివాసముంటున్నారు. కొందరు ఈ సమస్యను ఆయన దృష్టికి సైతం తీసుకువెళ్లారు. ఈ రూట్ మీదుగానే రిమ్స్‌కు రోగులను, క్షతగాత్రులను అంబులెన్సులో తీసుకువస్తుంటారు. కనీసం ఈ రూట్‌లో రహదారికి పడిన గోతులను పూడ్చేలా చర్యలు చేపట్టాలని శాంతినగర్ కాలనీతో పాటు హడ్కో కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.



## హమ్మయ్య..
# రిటైరయ్యాం

* ఊపిరిపీల్చుకుంటున్న రిటైర్డు పోలీసులు
* రిటైర్‌మెంట్ వయస్సు 63 ఏళ్లకు పెంచుతారంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాలు, ఊహాగానాలు
* మాకొద్దు బాబోయ్ అంటున్న కొందరు పోలీసులు
* రిటైర్డు ఉద్యోగులకు ఘన సన్మానం

**శ్రీకాకుళం క్రైం, జులై 31 (వార్త):**

కనిపించని మూడు సింహాలు చట్టానికి, ధర్మానికి, న్యాయానికి ప్రతిరూపాలైతే. కనిపించని ఆ నాలుగో సింహమేరా ఈ పోలీస్.. ఇది పోలీస్‌స్టోరీ సినిమాలోని డైలాగ్ ఎంతో పాపులర్ అయింది. పోలీస్‌కు సరైన నిర్వచనం అనేలా చేసింది. పోలీస్.. అంటే నేరస్థుల పాలిట సింహస్వప్నం, ప్రజలకు ధైర్యం. అలాంటి పోలీసులు ఒక్క రోజు సెలవు పెడితే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమవుతుందో ఓ సినిమాలో స్పష్టంగా చూపించారు. ఖాకీ వేసుకుని పోలీసులు విధుల్లోకి వస్తే చాలు.. ఆ ప్రాంతమంతా ష్ గప్‌చుప్.. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ట్రాఫిక్‌లో అటూఇటూ తిరుగుతూ వాహనాలు ఒక క్రమపద్ధతిలో వెళ్లేలా చూస్తుంటాడు. పగలనక, రాత్రనక బందోబస్తు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తుంటాడు. భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ ప్రజలకు నిత్యం సేవలందించే నిత్య శ్రామికుడు పోలీస్. పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడిన ఉద్యోగం. మిగతా శాఖలకు ఈ పోలీసు శాఖ పూర్తి భిన్నంగా ఉంటుంది. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న నిత్యసేవకుడు పోలీస్.. అలాంటి పోలీస్ నేడు మనోవేదనకు, మానసిక ఒత్తిడికి గురవుతూ అనారోగ్యానికి గురవుతున్నాడు.

గతంలో పోలీసులకు రిటైర్‌మెంట్ 58 ఏళ్లకే ఉండేది. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 60 ఏళ్లకు పొడిగించారు. 2019లో సీఎం అయిన జగన్మోహనరెడ్డి 62 ఏళ్లకు పెంచేశారు. 2024లో సీఎం చంద్రబాబు ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును మరో ఏడాది పెంచేస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటి వరకూ ఎటువంటి ఆదేశాలు రాలేదనుకొండి. సామాజిక మాధ్యమాల్లో మాత్రం ఇది కోడై కోస్తోంది. ఇదంతా పోలీసులపై ఉన్న మమకారం కాదు సుమీ.. రిటైర్ అయిన తర్వాత ఒక్కో పోలీసుకు సుమారు రూ.40 లక్షల వరకూ ఇవ్వాల్సివుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏడాది పోలీసులు పెద్ద ఎత్తున రిటైర్ అవుతుంటారు. వారికి ఆ మొత్తాలు ఇవ్వలేక రిటైర్‌మెంట్ వయస్సును పెంచేస్తున్నారన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. సర్లే దీన్ని పక్కన పెడితే.. రిటైర్‌మెంట్ వయస్సును పెంచేస్తుండడం వల్ల వయస్సు రీత్యా కొందరు పోలీసులు వేర్వేరు కారణాల వల్ల సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు. అలాగని ఉద్యోగానికి రాజీనామా కూడా చేయలేకపోతున్నారు. ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం కావడంతో చాలామంది బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లా పోలీసు బాస్‌లు కొందరు రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్న వారిని బందోబస్తుకు పంపించలేక వారితో డ్యూటీ చేయించలేక మానవత్వంతో వారిని కేవలం కార్యాలయానికే, ట్రాఫిక్‌కే పరిమితం చేస్తున్నారు.

### మనమంతా ఒకే కుటుంబ సభ్యులమే: ఎస్పీ

సుదీర్ఘకాలం జిల్లా పోలీస్ శాఖకు సేవలందించి ఉద్యోగ విరమణ చెందుతున్న పోలీస్ అధికారులు రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి కోరారు. సుమారు 35-40 సంవత్సరాలు పోలీసు ఉద్యోగం బాధ్యతలు చేపట్టి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సబ్ ఇన్స్పెక్టర్‌లు ఏ.ఎన్.వి. వెంకటరావు, ఎం.కోటేశ్వరరావు, పి.శ్యామలరావు, కె రమేష్ బాబు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.ఆనంద్‌రావు టి.సూర్యనారాయణలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం జిల్లా పోలీస్ శాఖకు సేవలు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. పోలీసు ఉద్యోగం అనేది మానసిక ఒత్తిడితో కూడుకొని కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధి నిర్వహణలు నిర్వర్తించవలసి ఉంటుందని తెలిపారు. రిటైర్‌మెంట్ అయినప్పటికీ మనమంతా ఒకే కుటుంబమని చెప్పారు. ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరితంగా అందేలా అన్ని విధాలుగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీలు త్రినాధ్ రావు, ఎల్ శేషాద్రి, ఏఓ సిహెచ్ గోపినాథ్, సిఐలు ఎల్ సన్యాసి నాయుడు, సోమశేఖర్, ఉమా మహేశ్వరరావు, దేవుల్లు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు కృష్ణం నాయుడు, కె.అప్పన్న, కె.రాధాకృష్ణ, భుజంగరావు, అరుణ్ కుమారి, జగదంబ, ఇతర అధికారులు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సత్యసాయినగర్‌లో
# రోడ్డుపైనే మురుగు

* మురుగునీటిలో దోమలు వ్యాప్తి * దుర్వాసనతో భరించలేక రోగాల బారిన కాలనీవాసులు * అర్జీ పెట్టినా పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



**శ్రీకాకుళం టౌన్, జులై 31(వార్త):** నగరంలోని వరం కాలనీలోనీ సత్యసాయినగర్ 7వ లైనులో సీసీ రహదారి, కాలువలు లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు బయటకు పోయే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దోమలకు నిలయంగా మారింది. మురుగు నీరు కంపుకొడుతుండడంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈకాలనీలో డ్రైడే ఫ్రైడే వంటివి అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సత్యసాయినగర్‌లో మురుగునీటి విషయమై కొందరు సోమవారం జడ్పీలో నిర్వహించిన మీకోసంలో అర్జీ ఇచ్చారు. అయినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు.

# పిల్లల హక్కులు సంరక్షించడం మన బాధ్యత



### జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు

**శ్రీకాకుళం లీగల్, జులై 31 (వార్త):** పిల్లల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. బుధవారం స్థానిక న్యాయసేవాసదన్‌లో జువెనిల్, పోలీసు అధికారులతో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా జువెనిల్ పోలీసులు అడ్డుకోవాలన్నారు. మైనర్ బాల బాలికలకి ఏమైనా సమస్య ఉంటే వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆశ్రయించాలని సూచించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




### శిథిలావస్థలో ఘనసర
# అంగన్వాడీ భవనం

**భామిని, జులై 31(వార్త):** ఘనసర గ్రామంలో ఉన్న అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అంగన్వాడీ భవనం స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఈకేంద్రానికి సుమారు 60 మంది వరకు పిల్లలు వస్తుంటారు. వర్షం పడితే అంగన్వాడీకి సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి ఉంది. ఈ అంగ న్వాడీ భవనాన్ని మరమ్మతులు చేయించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



# బదిలీలు షురూ

- * 39 మంది తహశీల్దార్లకు పోస్టింగ్
- * డీఎస్పీలకు బదిలీ
- * నేడో రేపు సీఐలకు స్థానచలనం
- * మరో వారం రోజుల్లో ఎస్ఐలకు

**శ్రీకాకుళం క్రైం, జులై 31 (వార్త):** ఎన్నికల ముందు జిల్లా నుంచి బదిలీ అయిన తహశీల్దార్లకు తిరిగి పోస్టింగ్‌లను ఇస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం తహశీల్దార్‌గా ఎస్.గణపతిరావు, రణస్థలం తహశీల్దార్‌గా ఎన్.ప్రసాదరావు, పోలాకికి ఎం.సురేష్‌కుమార్, వజ్రపుకొత్తూరుకు పి.బాల, సారవకోటకు కె.విజయలక్ష్మి, హిరమండలం బి.వెంకటరమణ, పొందూరు ఎస్.రమేష్ కుమార్, ఇచ్ఛాపురం ఎస్.వెంకటరావు, జలుమూరుకు జి.లక్ష్మీనారాయణ, గారకు ఎస్.రమణారావు, ఎచ్చెర్లకు ఎ.సింహాచలం, పలాసకు వి.సత్యం, మెళియాపుట్టికి ఎస్.హనుమంత రావు, నరసన్నపేటకు టి.హనుమంతరావు, పాతపట్నంకు ఎస్.కిరణ్ కుమార్, టెక్కలికి దిలీప్ చక్రవర్తి, బూర్జకు ఈశ్వరమ్మ, ఎల్ఎన్‌పేటకు వై.వి.పద్మావతి, కవిటికి వి.మురళీకృష్ణ, జి.సిగడాంకు ఎం.శ్రీకాంత్, కోటబొమ్మాళికి ఆర్.అప్పల రాజు, సరుబుజ్జిలికి ఎల్.మదుసూదనరావు, కొత్తూరుకు బి.పాపారావు, సోంపేటకు వి.అప్పలస్వామి, కంచిలికి వై.జయలక్ష్మి, లావేరుకు వై.జోగారావు, మందసకు బీడీవీ ప్రసాదరావులకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కలెక్టరేట్ ఏవోగా సూర్యనారాయణ, హెచ్ విభాగం సూపరింటెండెంట్‌గా రాజేశ్వరరావు, డి.విభాగం సూపరింటెండెంట్‌గా రమణమూర్తి, ఈ.విభాగం సూపరింటెండెంట్‌గా పి.సరోజిని, టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోగా జి.ప్రభాకరరావు, శ్రీకాకుళం డివిజన్ కార్యాలయం ఏవోగా జి.రామారావు, పలాస డివిజన్ కార్యాలయం ఏవోగా ఎస్.హైమావతి, స్పెషల్ తహశీల్దార్లుగా కె.శ్రీరాములు, పి.వేణుగోపాల రావు. ప్రవల్లికా ప్రియా, సత్యనారాయణలను నియమించారు.

## డీఎస్పీలకు బదిలీ..

జిల్లాకు చెందిన పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి, కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రరెడ్డి, డీటీసీ బి.విజయ్ కుమార్‌లను పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు రిపోర్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. వీరికి ఎక్కడ కూడా ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా 96 మంది డీఎస్పీలకు స్థానచలనం కల్పించారు. గురు, శుక్రవారాల్లో సీఐలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న సీఐలకు శ్రీకాకుళం జిల్లాలో ఇతర జిల్లాలకు బదిలీ అయ్యే ఛాన్స్‌లే ఎక్కువ. శ్రీకాకుళం వన్‌టౌన్ సీఐ మాత్రం రెండో పట్టణ సీఐగా వచ్చేందుకు తనవంతుగా పావులు కదుపుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు సీఐలు టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ అయ్యేలా శతవిధాలుగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మరో వారం రోజుల్లో ఎస్ఐలకు బదిలీ అయ్యే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఇప్పటికే జాబితా సిద్ధంగా ఉందని తెలిసింది.

# విద్యాలయాల్లో.. మృత్యుఘోష









**టెక్కలి, జులై31 (వార్త):** నందిగాంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మక అక్షిత అనే విద్యార్థిని మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె మరుగుదొడ్డి డార్మిటరీ కిటికీకి చున్నీతో ఉరివేసుకున్నట్టు కనిపిస్తోంది. కాళ్లు మాత్రం నేలకు తాకి వున్నాయి. దీంతో ఆమె మృతి పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం అక్షిత ఉరివేసుకుని ఉండడాన్ని చూసిన విద్యార్థినులు హాస్టల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రిన్సిపాల్ రమణి నందిగాం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మహమ్మద్ అలీ, క్లూస్‌టీంతో గురుకులానికి వచ్చి విచారణ చేపట్టారు. కాగా, నిమ్మక అక్షిత స్వగ్రామం కొత్తూరు మండలం పారాపురం కొత్తూరు మాసంగి గ్రామం. తల్లిదండ్రులు శ్రావణి, గిరి. వీరు భవన నిర్మాణం పనులు చేసుకుంటున్నారు. అక్షిత మృతి విషయమై ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు హుటాహుటిన నందిగాం గురుకులానికి చేరుకుని కూతురు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ప్రజాసంఘాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు రాకుండానే మృతదేహాన్ని ఆసుపత్రికి పోలీసులు తరలించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్షిత మృతదేహాన్ని చూసిన వీరు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని దళిత సంఘ నాయకుడు ఎడ్ల గోపితో పాటు గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డీఎస్పీ బాలచందర్ రెడ్డి గురుకులానికి వచ్చి మృతురాలు తల్లిదండ్రులతో మాట్లాడారు. సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. అయితే అక్షిత మృతిపై విద్యార్థినులు నోరు మెదపడం లేదు. మీడియా అడిగిన ప్రశ్నలకు తమకేం తెలియదనే సమాధానం మినహా ఎటువంటి సమాధానం రావడం లేదు.

### గురుకుల విద్యార్థిని మృతిపై నివేదిక ఇవ్వండి

నందిగాం గురుకులంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అధికారులను కోరారు. విద్యార్థిని మృతికి ఒత్తిడి వల్ల, లేక ఇతర కారణాలేవైనా ఉన్నాయా అన్నదానిపై సమగ్రంగా దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలన్నారు.

### సహకార సంఘాల్లో...
# మెక్కినదంతా కక్కిస్తాం

* అవినీతి చేసిన సొమ్ము రికవరీ చేస్తాం * ఒక్క రోజులో రైతుకు రుణం మంజూరు * సహకార సంఘాల ద్వారా రూ.38.7 వేల కోట్ల రుణాలు * ఆప్కాబ్, డీసీసీబీల రుణ అంచనా ప్రణాళిక * రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి * ప్రతి జిల్లాలో ఆప్కాబ్, డీసీసీబీ బ్రాంచ్‌లు * రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**టెక్కలి, జులై 31 (వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల పరిధిలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి నుంచి మెక్కినదంతా కక్కిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం టెక్కలి నియోజకవర్గం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆప్కాబ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో అనేక చోట్ల నకిలీ ధృవపత్రాలతో రుణాలు, రైతుల పేరుతో అదనపు రుణాలు, అధికారులే బినామీ పేర్లతో రుణాలు పొందిన అంశాలు తన దృష్టికి వచ్చాయని, సహకార వ్యవస్థను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రుణం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగే రోజులు పోవాలని, ఒక్క రోజులో రైతుకు రుణం అందించే విధంగా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేసి త్వరలో ఆ దిశగా చర్యలు ప్రారంభించాలని సూచించారు. రైతు ఆధార్ కార్డు తో మీ భూమి, ఈసీ, ఈ క్రాప్ అనుసంధానం చేసి రుణాల కోసం వచ్చే రైతులకు అత్యంత వేగంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన సహకార సంఘాలను ఆన్ లైన్ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఆప్కాబ్, డీసీసీబీల నుంచి సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది రూ.38.7వేల కోట్లు అందించేందుకు అంచనా ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రుణాలు మంజూరు చేసే క్రమంలో జాప్యం లేకుండా చూడా లని, రైతులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. వ్యవసాయ పంట రుణాలతో పాటు రైతులకు దీర్ఘకాలిక రుణాలు, రైతుల పిల్లల చదువు నిమిత్తం విద్యా రుణాలు, విదేశీ విద్యా రుణాలు మంజూరు చేసేందుకు ఆప్కాబ్ మరింత వేగం పెంచాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఆప్కాబ్ బ్రాంచ్ ల ఏర్పాటుకు కసరత్తు వేగవంతం చేయాలని, అనుమతులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తక్షణమే దరఖాస్తు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో మహిళా మండలి రుణాలు, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన రుణాలు, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన రుణాలు మంజూరులో ఆప్కాబ్ బ్రాంచ్‌లు, డీసీసీబీలు తమ సేవలు మరింత విస్తృతం చేయాలని సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన రాయితీ రుణాలతో పాటు హామీ లేని రుణాలు (సీ.జీ.టీ.ఎమ్.ఎస్) రుణాలు మంజూరు గురించి ప్రజలకు అవగాహన పెంచి సాధ్యమైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీలో
# కూటమి నేతలు పాల్గొనాలి
### శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్




**శ్రీకాకుళం టౌన్, జులై 31(వార్త):** ఆగస్టు నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లు పంపిణీ గురువారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభమవుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో మాదిరిగానే నియోజక వర్గంలో 1వ తేదీనే అత్యధిక పింఛన్లను పంపిణీ చేసి శతశాతం నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు, సచివాలయ సిబ్బంది, నియోజకవర్గంలోని రూరల్, గార మండలాల నాయకులతో పాటు నగరంలోని అన్ని డివిజన్లకు చెందిన ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. వృద్ధులకు, వికలాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని చెప్పారు.

## ఒకటినే ఎన్టీఆర్ భరోసా పెన్షన్



**భామిని, జులై 31(వార్త):** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ఆగస్టు 1వ తేదీన పెన్షన్ పంపిణీకి ప్రభుత్వం సూచనలు చేసిందని జనసేన పార్టీ భామిని మండలం ప్రధాన కార్యదర్శి మాడపాన అనీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్లను సచివాలయం సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు. మొదటి రోజే 99 శాతం పంపిణీ పూర్తి కావాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే ప్రభుత్వం సూచించిన ప్రకారం రెండో రోజు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. మూడవ రోజు పంపిణీ లేదన్న విషయం గమనించాలన్నారు. పింఛను దారులు, దూర ప్రాంతాలకు వెళ్లినా, ఎక్కడ ఉన్నా ఆగస్టు ఒకటి, రెండో తేదీలలో తప్పని సరిగా ఇంటి వద్దే అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలని అనిల్ కుమార్ తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులు

**పలాస,జులై 31 (వార్త):** స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చం అందించి, దుశ్శాలువతో సత్కరించారు. ఆమెను కలసిన వారిలో ఆ సంఘ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ భానుమూర్తి, విజయనగరం జోనల్ సెక్రటరీ బీకే మూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు త్రినాధ్, కార్యదర్శి దశరధుడు, పలాస డిపో నాయకులు దిలీప్ కుమార్, ఎం.ఎ.రాజు, జీకే రాజు, ఎమ్మెస్ నారాయణ, పీఎల్ నారాయణ తదితరులున్నారు.

# సుందర శ్రీకాకుళం నిర్మాణమే ధ్యేయం

*** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం * శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ * నగరంలోని పలు రోడ్లకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన**

**శ్రీకాకుళం టౌన్, జులై 31 (వార్త):** సుందర శ్రీకాకుళం నిర్మాణంలో భాగంగానే నగరంలోని పలు డివిజన్లలో నూతన రోడ్లను నిర్మాణం చేపడుతున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డగ్లస్ స్కూల్ దగ్గర, 30, 33, 44 డివిజన్లలో రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నగరవాసులు కనీస మౌళిక సదుపాయాలకు నోచుకోలేదని తెలిపారు. నగరంలోని అనేక రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. బటన్ నొక్కడం నాయకులు జేబులు నింపుకోవడం ఇదొక్కటే వారు చేసిన పాలన అని విమర్శించారు. ప్రజల కనీస అవసరాలను తీర్చలేని విధంగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. అయితే వైసీపీ పాలనకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని, గొప్ప విజన్ కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే దానికి సమాంతరంగా అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. నగరంలో ప్రజలకు కనీస మౌళిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం మెరుగు తదితర అంశాలపై దృష్టి సారించానని శంకర్ తెలిపారు. ఇప్పటికీ సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించామని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో పూర్తిస్థాయి మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని తొలి విడతగా రోడ్లు నిర్మాణం చేస్తున్నట్టు వివరించారు. అలాగే విలీన పంచాయతీల్లో కూడా తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందన్నారు. నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందజేయాలని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే నెం1 కార్పొరేషన్‌గా తయారు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు నగర ఇంచార్జ్ కమిషనర్ చల్లా ఓబులేషు, టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

**మందస, జులై31 (వార్త):** నాటుసారా తయారీని అరికట్టేందుకు మందస మండలం కొండలోగాం గ్రామ శివార్లలో సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది దాడులు నిర్వహించారు. అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1300 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై కూడా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జైభీం చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ చంద్ర మోహన్, సిబ్బంది కాంతారావు, శాంతరావు తదితరులు పాల్గొన్నారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి నాటుసారా తయారీ, రవాణా గురించి గానీ, నాటుసారా అమ్మకాలను గురించి గాని 9440902358 నంబరుకు తెలియజేయవలసిందిగా సీఐ జైభీం కోరారు. నాటుసారాపై సమాచారం అందించిన వారి వివరాలు అతి గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## అర్హత కలిగిన సంఘాలకు స్త్రీనిధి రుణాలు



**మందస, జులై 31 (వార్త):** అంబుగాం గ్రామంలో వీవో సమావేశం నిర్వహించారు. ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు ఒక సంఘానికి 5లక్షల రూపాయలు మంజూరవుతాయన్నారు. పదిమంది సభ్యులు వరకు ఆర్థిక సహాయం పొందవచ్చున్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న ఎస్‌హెచ్‌జీలు ఆటో డెబిట్ ద్వారా సంఘం అకౌంట్ నుండి రికవరీ చెల్లించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రసాదరావు, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, వీవోఏ చంద్రావతి, వీవో అధ్యక్షులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

### సుడా స్మార్ట్ సిటీ ప్లాన్‌తో..

## పలాస రూపురేఖలు మార్చేస్తాం

*** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస,జులై 31 (వార్త):** సుడా స్మార్ట్ సిటీ ప్లాన్‌తో పలాస రూపురేఖలు మారుతాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. బొడ్డపాడు రెవిన్యూ పరిధిలోని 150 ఎకరాల విస్తీర్ణంతో స్మార్ట్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. బుధవారం అధికారులతో, టిడిపి నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణాలకు ధీటుగా టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్లో 150 ఎకరాల విస్తీర్ణంతో పలాసలోనే మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. రియల్ ఎస్టేట్ తో పాటు మధ్య తరగతి వాళ్లకు కూడా మంచి ఇల్లు ఇచ్చే ఆలోచనను కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. వచ్చే ఐదేళ్లలో టౌన్ షిప్ అందరికి అందుబాటు తీసుకొస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 20 శాతం మంది పారదర్శంగా బుక్ చేసారని, ఎవరైనా ఆన్లైన్లో బుక్ చేసుకుంటే ఈ టౌన్ షిప్‌లో కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మొదట విడత 10శాతం, రెండో విడతలో 30శాతం, చివరి విడతలో మొత్తం నగదు జమ చేయాల్సివుంటుందన్నారు. కార్యక్రమంలో సుడా వైస్ చైర్మన్ ఓబులేసు, ప్లానింగ్ ఆఫీసర్ టీజీ రామ్మోహన్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిషోర్ కుమార్, పబ్లిక్ ఈఈ శంకర్రావు, టిడిపి నాయకులు వజ్జ బాబురావు, కొర్ల కన్నారావు, గాలి కృష్ణారావు, గురిటి సూరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.





## మంత్రి అచ్చెన్నకు ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు

ప్రతి చేనుకు నీరందించే సంకల్పానికి వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బాసటగా నిలిచారని పలాస ఎమ్మెల్యే శిరీష అన్నారు. నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. నియోజకవర్గంలో గత ఐదేళుగా సాగునరందక రైతులు అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే సమృద్ధిగా అన్నదాతకు సాగునీరు అందిందన్నారు. ఈ ప్రాంత రైతులందరి తరఫున మంత్రి అచ్చెన్నకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. రైతుల కష్టాలను తొలగించేందుకు మంత్రి చూపిన చొరవ అభినందనీయమన్నారు. నిర్ణీత సమయం కంటే ముందే సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్టు మంత్రితో చెప్పారు. అంతకుముందు ఆయనకు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్ కుమార్, టీడీపీ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా కొర్ల కన్నారావు, కొరికాన శంకరరావు, జనా అప్పారావు, తదితరులున్నారు.

## పూర్వ విద్యార్థుల కుమారుల వితరణ



**మందస, జులై 31 (వార్త):** మందస పట్టణంలోని రాజుల హయాంలో నిర్మించబడిన విద్యాలయం పునః నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారు. ఇదే పాఠశాలలో చదువుకున్నా, చదువక పోయినా స్పందిస్తున్నారు. ఐకానిక్ భవనం కావడంతో యధాతథంగా నిర్మించడానికి ప్రొఫెసర్ పట్నాల మోహనరావు ఆచారి, కమిటీ, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. కాగా.. మందస పట్టణంలోని శాసనాం వీధికి చెందిన శ్రీ రాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కృష్ణ చంద్ర పండా (1954 ఎస్ఎస్ఎల్సీ బ్యాచ్), ఆయన సోదరుడు అమూల్య కుమార్ పండా (1958 ఎస్ఎస్ఎల్సీ బ్యాచ్) జ్ఞాపకార్థం వారిరువురి కుమారులు, ముంబైలో ఉంటున్న సత్య స్వరూప్, భువనేశ్వర్ నివాసి స్వచ్ఛ సలీల్ పాఠశాలను సందర్శించారు. ఐకానిక్ భవనం మరమ్మత్తులు చేయడానికి రూ.50వేలు విరాళముగా అందజేశారు.

## భగత్ సింగ్, రాజా గురుదేవ్ సింగ్ వర్ధంతి

**పలాస, జులై31 (వార్త):** మాకనపల్లిలో భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్, ఉద్ధంసింగ్ విగ్రహాల వద్ద 84వ సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజు గురు సుఖదేవ్, ఉద్ధం సింగ్‌లు కాకుండా ఇంకా అనేకమంది దేశ భక్తులు భారతదేశ స్వాతంత్రంకై పోరాడి నేలకు ఒరిగారన్నారు. ఈ కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం శ్రీకాకుళం జిల్లా సభ్యులు పత్తిరి డానేసు, రాపాక చిరంజీవి, ఇతరత్రా సంఘాల నుంచి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## సహారా డిపాజిట్లు తక్షణమే చెల్లించాలి

**పలాస, జులై 31 (వార్త):** సహారా కస్టమర్స్ అండ్ ఫీల్డ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలాస సహారా కార్యాలయం వద్ద ఖాతాదారులు, ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం రీజన్ పరిధిలో సుమారు రూ.500 కోట్ల రూపాయలు సహారా సంస్థ ఖాతాదారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. సహారా బాధిత ఖాతాదారులు, ఏజెంట్ల ఇబ్బందులను గుర్తించి సొమ్ములను బ్యాంకు ఖాతాలో జమ చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు బైపల్లి సత్యరాజు, బోయిన సత్యనారాయణ, సూర్యారావు, కే వరప్రసాదరావు, శ్రీనివాసరావు, బాబూరావు, డీఎన్ మోహన్‌రావు, హేమచంద్ర, రూప్ సుందర్, ఉంటాడ చింతాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా కృష్ణారావు

**సంతబొమ్మాళి, జులై31(వార్త):** నౌపడ పంచాయతీ, సీతానగరం స్వదేశీయ మత్స్యకార సహకార సంఘానికి బుధవారం జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షులుగా వాడరేవు కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా బి.చిన్నబాబు, సొసైటీ సెక్రటరీ బి.బ్రహ్మానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘ బోర్డు సభ్యులుగా లింగూడు కుమార స్వామి, బి.పాండురాజు, బి.ఆదినారాయణ, బి.నాగరాజు, వాడరేవు సింహాచలం, బి.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసన్నపేట మత్స్యశాఖ ఎఫ్‌డీవో సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అనంతరం అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో మత్స్యకారుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బేనియా గురుదేవ్‌కు అభినందన వెల్లువ

గార, జూలై 31 (వార్త): గార మండలం కళింగపట్నం పంచాయతీ, రాధాకృష్ణ పేటలో ఇన్‌ల్యాండ్ మెరైన్ సొసైటీకి కొత్తగా ఎన్నికైన బెనియా గురుదేవ్‌ను కళింగపట్నం మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి బుధవారం అభినందించారు. భాగంగా బెనియా గురుదేవ్ కళింగపట్నం ఇన్‌ల్యాండ్ మెరైన్ సొసైటీ అభివృద్ధి కార్యక్రమాలలో సహకారం అందించాలని పొట్నూరు కృష్ణ మూర్తి ద్వారా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండ శంకర్‌కు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ పేట ప్రజలు పాల్గొన్నారు.



## కంబాలరాయుడుపేట మత్స్యకార సొసైటీ
# అధ్యక్షులుగా మూగి జంగమయ్య



వజ్రపుకొత్తూరు, జూలై 31 (వార్త): వజ్రపుకొత్తూరు మండల కంబాలరాయుడుపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షులుగా మూగి జంగమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోంపేట మత్స్య ఎఫ్‌డీఓ ఎన్నికల అధికారి కొల్లి రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులు మూగి జంగమయ్యతోపాటు వైస్ ప్రెసిడెంట్‌గా తండేలా ఉమాపతి, కార్యదర్శిగా లండ జంగమయ్యలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. సొసైటీ డైరెక్టర్‌గా గణగళ్ళ రాజు, గరికిన నూకరాజు, గోవిందా నీలయ్య, వాసుపల్లి బాలరాజు, కంబాల వెంకట స్వామి, బడే ఈశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి కొల్లి రవికుమార్ వెల్లడించారు. అలాగే ఈ సొసైటీ ఎన్నికలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంక చిరంజీవి, మాజీ సర్పంచ్ కంబాల దానేసు, మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ కొండ నాగరాజు, వివిఫ్‌ఏ రంగారావు, సాగర్ మిత్రులు అంబటి జానకిరావు, గుంటు రవికుమార్, రావాడ హరి ప్రసాద్, అంగ జోగారావు పాల్గొన్నారు.

### సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా: మూగి జంగమయ్య

కంబాలరాయుడుపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని సొసైటీ అధ్యక్షులు మూగి జంగమయ్య అన్నారు. గత పరిపాలించిన సొసైటీ అధ్యక్షులు కన్నా భిన్నమైన రీతిలో సొసైటీని ముందు ముందుకు తీసుకుని వెళ్తానని చెప్పారు. అలాగే ఫైబర్ తెప్పలు, వలలు, బోట్లు, ఇంజిన్లు, ఐస్ బాక్సులు, ఇతర పరికరాలను సబ్సిడీ రూపంలో మంజూరుకు కృషి చేస్తానని, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో ఈ సొసైటీని అభివృద్ధి చేస్తానని మత్స్యకారులకు అధ్యక్షులు జంగమయ్య హామీ ఇచ్చారు.

## చేపల చెరువు లీజుపై
# వాడి వేడి చర్చ

### బహిరంగ వేలానికి కౌన్సిల్ ఆమోదం
### తెలుగుదేశం కౌన్సిలర్‌ల వాకౌట్





ఇచ్ఛాపురం, జూలై 31, (వార్త): మున్సిపాలిటీ పరిధిలో ఐదు చేపల చెరువుల లీజు అంశంపై కౌన్సిల్లో వాడివేడిగా చర్చ జరిగింది. గత రెండు సంవత్సరాలుగా వాయిదా పడుతూ వస్తున్న చేపల చెరువు లీజు అంశం మరో మారు కౌన్సిల్ ముందుకు వచ్చింది. మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించేలా ఉందని వైస్ చైర్ పర్సన్ లాభాల స్వర్ణమని ఆక్షేపించారు. రెండేళ్లుగా అన్యాయం జరుగుతుండడంతో పాత సొసైటీకి లీజు కేటాయించాలని నాలుగు, ఐదు వార్డుల కౌన్సిలర్లు గేదలశేఖర్ నారాయణ బెహేరాలు కోరారు. సొసైటీలో చేరేందుకు చాలా మంది నిరుపేద మత్సకారులు ఉన్నారని, వారందరికీ అవకాశం కల్పిస్తే అందరూ బ్రతుకుతారని వైస్ చైర్పర్సన్ ఉలాల భారతీ దివ్య చెప్పారు. తక్కువకి లీజు పాడి చేపలు అధిక ధరలకి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని కౌన్సిలర్ బచ్చు జగన్ ఆరోపించారు. ఈ అంశంపై తెలుగుదేశం వైసిపి కౌన్సిలర్ల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. చివరకు బహి రంగం వేలం వేయాలని సభ్యులు పట్టు పట్టడంతో చైర్పర్సన్ రాజ్యలక్ష్మి ఓటింగ్ నిర్వహించారు. వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు అందరూ బహిరంగవేలానికి ఓటు వేశారు. తెలుగుదేశం కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్ యాదవ్, ఆసి లీలా రాణీ,నారాయణ బెహేరా, గేదెల శేఖరు వాక్ అవుట్ చేశారు. అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పబ్లిక్ టాయిలెట్‌ను రోటరీ సంస్థ కు కేటాయిస్తే మంచిదని సభ్యులు కోరడంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు.

## నిరంతరాయంగా
# నిత్య నారాయణ సేవ

శ్రీకాకుళం జూలై 31, (వార్త): నగరంలోని ఏడురోడ్ల కూడలి పాత బస్టాండ్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ నిరంతరాయంగా కొనసాగుతోంది. నాడు వైసీపీ ప్రభుత్వం నిరంకుశ నిర్ణయంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా కాంటీన్లను మూసివేస్తే, ఆకలి కష్టాన్ని తెలిసిన సామాన్యునిలా గొండు శంకర్ పేదప్రజలకు అండగా నిలిచారు. తన స్వంత ఖర్చులతో అన్నా క్యాంటీన్ ద్వారా ఉచిత భోజనం అందించే మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ నిత్య నారాయణ సేవ నేడు 468 రోజులు పూర్తి చేసుకుంది. తిరిగి ప్రభుత్వ అన్నా క్యాంటీన్ ప్రారంభం అయ్యేవరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే శంకర్ ఇచ్చిన మాట తప్పకుండా, నాణ్యతలో రాజీపడకుండా, అడిగిన వారికి లేదనకుండా ప్రతిరోజూ అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు.




## ఆశాజనకంగా గోగు పంట

జలుమూరు జూలై 31 (వార్త): జలుమూరు మండల పరిధిలోని యలమంచిలి, అక్కురాడ, మహ్మద్ పురం, లచ్చన్న పేట, కామి నాయడుపేట, పాగోడు, కొండ పోలవలసతో పాటు పలు గ్రామాల్లో గోగు సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్, మే నెలల్లో వేసిన గోగు సాగు ఇటీవల కురిసిన వర్షాలకు ఏపుగా పెరిగింది. వాతావరణం సహకరిస్తే మరో నెల వ్యవధిలో గోగు తీసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. సుమారు 400 ఎకరాల్లో గోగు సాగు చేస్తున్నారు.

## సారవకోటలో పారిశుద్ధ్య పనులు

సారవకోట, జలుమూరు జూలై 31 (వార్త): సారవకోటలోని పారశెల్లిలో పారిశుద్ధ్య పనలు చేపట్టారు. కాలువల్లో పూడికలు పేరుకు పోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు రహదారిపై ప్రవహి ంచేది. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడేవారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యపై స్పందించిన సర్పంచి కె.శంకర్ బాబు, కార్యదర్శి సింహాచలం పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

జలుమూరు జూలై 31 (వార్త): ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ ఎస్.కె.వి. సత్యనారాయణ అన్నారు. జలుమూరు మండలం పర్లాం ఇసుక రేవును ఆయన పరిశీలించారు. ఇసుక రేవుల వద్ద రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారికి అడ్డంగా తవ్విన కందకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పాఠశాల తరగతి గదిలో కింగ్ కోబ్రా



మెలియాపుట్టి జూలై 31 (వార్త): మెలియాపుట్టి మండలంలో గల పెద్దమడి గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం సమయంలో పదవ తరగతి విద్యార్థులు ఉండే తరగతి గదిలో హఠాత్తుగా కింగ్ కోబ్రా సర్పం కనిపించడంతో విద్యార్థులు తరగతి గది నుంచి బయటికి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న వెంటనే పాఠశాల సిబ్బంది అప్రమత్తమై ఫారెస్ట్ సిబ్బందికి సమావేశ సమాచారం అందించడంతో వారు వచ్చి సుమారు 7అడుగుల పొడవు ఉన్న కింగ్ కోబ్రా పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో సుదూరంగా విడిచిపెట్టారు.

## పోలాకి తహసీల్దార్‌గా ఎం.సురేశ్ కుమార్

పోలాకి, జలుమూరు జూలై 31 (వార్త): పోలాకి మండల తహసీల్దార్గా ఎం.సురేశ్ కుమారును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వేరే జిల్లాకు బదిలీ అయిన సురేశ్ కుమార్ తిరిగి సొంత జిల్లాకు వచ్చి రిపోర్ట్ చేశారు. ఈ మేరకు ఆయనను పోలాకి మండలం తహశీల్దార్గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


జలుమూరు జూలై 31 (వార్త): మారుమూల గ్రామాల నుండి పట్టణ గ్రామాల వరకు యువత అనేక మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వడం విచారకరమని ప్రత్యేక ప్రొహిబిషన్ ఎస్‌బి ఇన్స్పెక్టర్ కుమార్ అన్నారు. జలుమూరు మండలం మర్రివలస గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన యాంటీ డ్రగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శత శాతం యువత విద్యార్థి దశలోనే కొంత మంది వీటికి బానిసలు అవుతున్నారని దీనివల్ల అనర్థాలు కుటుంబ నాశనం జరుగుతుందని ఆయన హితవుపలికారు. ఆయనతోపాటు ప్రముఖ న్యాయవాది చింతాడ వెంకటరావు, వార్డ్ మెంబర్ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లాకు రూ.250 కోట్లు



జలుమురు జూలై 31 (వార్త): కేంద్ర బడ్జెట్లో రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. రాష్ట్రంలోని 7 జిల్లాలకు రూ. 1,750 కోట్లు కేటాయించింది. ఒక్కో జిల్లాకు రూ.250 కోట్లు రానున్నాయి. వెనుకబడిన జిల్లాల జాబితాలో ఉన్న శ్రీకాకుళం జిల్లాకు కూడా రూ.250 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయనుంది. ఈ నిధులను జిల్లా అభివృద్ధికి వినియోగించనున్నారు

## నరసన్నపేట తాహసీల్దార్‌గా సత్యనారాయణ



నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): నరసన్నపేట తాహసీల్దారుగా డి.సత్యనారాయణను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీ అయన ఎన్నికల అనంతరం తిరిగి జిల్లాలో రిపోర్ట్ చేశారు. ఈ మేరకు జిల్లాలో తహసీల్దార్లను నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో నరసన్నపేట తహసీల్దారుగా సత్యనారాయణను నియ మించడంతో మరో రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## స్వచ్ఛమైన నీటితో వ్యాధులు దూరం




నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): స్వచ్ఛమైన నీటిని ప్రతి ఒక్కరూ వినియోగిస్తే వ్యాధులు దూరమవుతాయని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిణి పి.శిరీష తెలిపష్లరు. బుధవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాధులు పట్ల అవగాహన సమావేశాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ వేడి నీటిని తాగటం వలన సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించండి
### డీఎల్‌పీఓ రమణ



మెలియాపుట్టి జూలై 31 (వార్త): గ్రామాలలో త్రాగునీరు పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటిపై దృష్టి సారించాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐవి రమణ అన్నారు. బుధవారం మెలియాపుట్టిలో కార్యదర్శులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నీటి నిల్వలు, చెత్తాచెదారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చర్యలు చేపడుతూనే స్థానిక ప్రజానీకానికి ఈ విషయమై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో దోమలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ యంత్రాంగం దృష్టి సారించాలని తెలియజేస్తూనే పంచాయతీ స్థాయిలో చేపట్టవలసిన అనేక అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు తదితరులున్నారు

## పర్యావరణ పరిరక్షణ యువత లక్ష్యం కావాలి



నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): పర్యావరణ రక్షణకు యువత నడుం బిగించి ముందుకు రావాలని కూటమి సభ్యులు పిలుపు నిచ్చారు. బుధవారం నరసన్నపేట మండలం నడగాం పంచాయతీలోని వరాంపురం గ్రామంలోని పెద్ద చెరువు వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా ముందుకు రావాలని వివరించారు.

## ఉదయం 5.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీ





నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలోని సచివాలయ పరిధిలో ఉదయం 5.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రత్యేక పర్యవేక్షణ అధికారి కె.యుగంధర్ ఆదేశించారు. బుధవారం నరసన్నపేట మండలంలోని పలు సచివాలయాలలో పింఛన్ పంపిణీ చేసే అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు గంటలకే ఆయా గ్రామాలకు సిబ్బంది చేరుకోవాలని సూచించారు. శత శాతం పంపిణీ జరిగేలా చూడాలన్నారు.

## కొత్త పోలవలస సర్పంచ్‌గా పట్ట ప్రభాకర్‌రావు



నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): నరసన్నపేట మండలం కొత్త పోలవలస గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పట్ట ప్రభాకరరావును నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి తాత్కాలిక నియామక పత్రం అందజేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో జి.రామకృష్ణారావు మాట్లాడుతూ గత సర్పంచ్ మిస్సింగ్ కావడం, పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న ప్రభాకర్‌రావును సర్పంచ్‌గా నియమిం చామన్నారు. సాధారణ పరిపాలన అంతా కూడా ఈయన చూసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

# నా విద్యుత్ మీటరు కనెక్షన్ ఎలా తొలగించారు

### న్యాయం చేయాలని కోరుతున్న చర్చ్ యజమాని
### పోర్జరీ సంతకం చేసిన వారిపై చర్యలు శూన్యం
### ఒకే చర్చికి సెక్రటరీ రెండు ఎన్‌ఓసి సర్టిఫికేట్లు ఎలా ఇచ్చారు




ఎల్ఎన్‌పేట, జూలై 31 (వార్త): తన విద్యుత్ మీటరు కనెక్షన్‌ను అన్యాయంగా తొలగించారని హిరమండలం మండలం, గొట్ట గ్రామానికి చెందిన కర్రి అమ్మారావు అనే చర్చ్ యజమాని వాపోయారు. స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ఎభినేజర్ బాప్టిస్ట్ చర్చ్ కోసం కరెంటు మీటరు కావాలని పంచాయితీ సెక్రటరీకు 2020 సం. ఫిబ్రవరి నెలలో దరఖాస్తు చేసుకోగా పంచాయితీ సెక్రటరీ ఉధయకుమార్ అదే నెలలో మీటర్ కోసం ఎనైసి సర్టిఫికేట్ మంజూరు చేశారన్నారు. వెంటనే సంబంధిత ఎలక్ట్రికల్ ఏఈ, సచివాలయం లైన్మేన్లు కలసి ఎనైసీ సర్టిఫికేట్ ప్రకారం ఆయా ఎభినేజర్ బాప్టిస్ట్ చర్కు మీటరు అమర్చారన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 2023 నెలలో చర్చ్ యజమాని కర్రి అమ్మారావు అనే వ్యక్తి కరెంటు బిల్ చెల్లించుటకు విద్యుత్ కార్యాలయానికి వెల్లగా అతని కరెంటు మీటరు తొలగించినట్లు విద్యుత్ సిబ్బంది తెలపడంతో వెంటనే చర్చ్ యజమాని లబోదిబోమంటూ హిరమండలం ఏఈ వారికి సమాచార హక్కు చట్టం ద్వారా ధరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు 30 రోజులలో సమాచారం ఇవ్వలేదని, టెక్కలి డిఈ ఆఫీసునకు అప్పీలు చేసుకోగా 60రోజుల తర్వాత ఆయనకు సమాచారం అందజేయడం జరిగిందన్నారు. ఆయనకు ఇచ్చిన సమాచారంలో చర్చ్ యజమాని కర్రి అమ్మారావు అనే పేరున దొంగ దరఖాస్తు పెట్టి కె.అమ్మారావు అని పేరు ఫోర్జరీ సంతకం చేసిన వేరే వ్యక్తికి మీటరు మంజూరు చేశారని చర్చ్ యజమాని అమ్మారావు స్థానిక విలేకర్లకు తెలిపారు. పంచాయితీ సెక్రటరీ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాత మీటర్ కనెక్షన్ డిస్కనెక్షన్ చేయకుండా, చర్చ్ యజమానికి ఎటువంటి నోటీసు జారీ చేయకుండా ఒకే చర్చికి రెండో ఎన్టీసీ మంజూరు చేసి వేరే వ్యక్తి పేరిట మీటరు మంజూరు చేసి ఆదే చర్చికు అమర్చియున్నారని వాటిపై సుమారు ఎనిమిది నెలల క్రితం నుంచి చర్చి యజమాని జిల్లా కలెక్టరువారికి, స్పందన, జిల్లా సూపరిండెంట్ ఇంజనీరుకు, టెక్కలి డివిజనల్ ఇంజనీర్‌కు అనేక సార్లు పిర్యాదు చేసినప్పటికి నేటికి తమకు న్యాయం జరగలేదని చర్చ్ యజమాని అమ్మారావు స్థానిక విలేఖర్ల ముందు మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగ జేసుకొని తన పేరు ఫోర్జరీ చేసి, తప్పుడు ధరఖాస్తు పెట్టిన వారిపై తగు చర్యలు తీసుకొని, సర్వీస్ నెం.303 గల విద్యుత్ మీటరును చర్చికి అమర్చాలని యజమాని కోరుతున్నారు.

# ఉపాధ్యాయులు మంచి సమాజాన్ని అందించగలరు

### ఎంఈఓ దేవేందర్‌రావు



మెలియాపుట్టి జూలై 31 (వార్త): మంచి సమాజాన్ని అందించగలిగేది ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమని మండల విద్యాశాఖ ఆధికారి దేవేందర్‌రావు అన్నారు. మండలంలో గల పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేసి బుధవారం పదవీ విరమణ చేసిన అంగూరు వెంకట రమణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పనిచేస్తూనే ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తయారు చేసి మంచి సమాజాన్ని రూపొందించగలిగే బృహత్తర కార్యక్రమాన్ని ఒక్క ఉపాధ్యాయులు మాత్రమే చేయగలరన్నారు. వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పలువురు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవి విరమణ చేసిన ఏవి రమణమూర్తి పదిమందికి ఆదర్శం అన్నారు. సన్మాన గ్రహీత, పదవీ విరమణ చేసిన రవణమూర్తి దంపతులకు శాలువ కప్పి, సన్మా నం చేసి మెమొంటో అందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో స్థానిక విద్యాశాఖ అధికారులు దేవేందర్‌రావు, పద్మనాభంతోపాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు, సిఆర్‌పిలు, బోధనేతర సిబ్బంది, గ్రామస్తులు, ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి దస్త్రాలు సిద్ధం చేయండి: ఏపీవో



మెలియాపుట్టి జూలై 31 (వార్త): జాతీయ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీకి సమర్పించవలసిన దస్త్రాలను సత్వరమే సిద్ధం చేయాలని ఉపాధి హామీ ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణరెడ్డిలు తెలిపారు. సిబ్బంది తయారుచేసిన దస్త్రాలను బుధవారం కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందని దానికి సంబంధించిన రికార్డులు క్షేత్రస్థాయిలో సిద్ధం చేయాలని, ఎక్కడ ఏటువంటి సమస్య రాకుండా పనిచేయాలన్నారు. ప్రతి పంచాయతీలో క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో రికార్డు వర్క్ పూర్తి చేయాలని, సామాజిక తనిఖీ సిబ్బందికి ఎకామిడేషన్ ఇతరత్రా సదుపాయాల కల్పనకు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన




నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.సి.డి.ఇ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాకివలస పిహెచ్‌సి డా.పి.శిరీష మాట్లాడుతూ వివిధ రకాల సీజనల్ వ్యాధులకు గల కారణాలు, నివారణ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, బిసిడిఈ కోఆర్డినేటర్ శ్రీవిద్య, హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం తహశీల్దార్‌గా వెంకట్రావు



ఇచ్ఛాపురం, జూలై 31 (వార్త): ఇచ్ఛాపురం తహశీల్దార్‌గా నిడిగంట్ల వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా విశాఖపట్నంకి బదిలీ అయి తిరిగి స్వంత జిల్లాకి కేటాయించడంతో ఇచ్ఛాపురంలో చేరారు. ఇక్కడ పని చేసిన తహశీల్దార్ అప్పారావు విశాఖపట్నంనకు బదిలీ అయ్యారు. కాగా వెంకట్రావు గతంలో కంచిలి తహసీల్దార్‌గా కూడా పని చేసారు.

## పౌష్టికాహారం విధిగా అందించాలి



ఇచ్ఛాపురం, జూలై 31, (వార్త): గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, 21వ వార్డు ఇన్‌చార్జి కాళ్ళ జయదేవ్ యాదవ్ అన్నారు. 100 రోజుల సంకల్ప కార్యక్రమంలో భాగంగా సామాజిక భాగస్వామ్యం అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ శక్తి 100 రోజులు (జూన్ 21 నుండి అక్టోబర్ 4 వరకూ) ప్రోగ్రాంపై తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. మహిళలు పిల్లలు పట్ల అరాచకాలు, ఆసాంఘిక కార్యక్రమాలు జరిపిన వారికి చట్ట ప్రకారం శిక్షలు వేయడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు జరగకూడదు అని, యుక్త వయసు గల బాలికలపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ కాళ్ళ వెంకటలక్ష్మి, సీడీపీఓ పి.నాగరాని, బి.సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవసరం



ఇచ్ఛాపురం, జూలై 31 (వార్త): విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవసరం అని మోటివేషనల్ ట్రైనర్స్ చెప్పారు. జేసీఐ క్లబ్బు 75 వసంతల పూర్తి చేసుకున్న సందర్భంగా లెట్స్ మేక్ ఎ డిఫరెన్స్ అనే అంశంపై విద్యార్థులకు మూడు చోట్ల వేరువేరుగా శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రైనర్ ఎం సునీత, వెంకటేశ్వర స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రైన్ ఎం.సంతోష్ దాస్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ రావు, మధు కుమార్ స్వరూప్ కుమార్, డిల్లేసు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సారవకోట మండల తాహసీల్దారుగా విజయలక్ష్మి



సారవకోట, జలుమూరు జూలై 31 (వార్త): సారవకోట తాహసీల్దార్‌గా విజయలక్ష్మిని నియమిస్తూ బుధవారం కలెక్టర్ స్వప్నికల్ దినకర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ భాగ్యవతి ఎన్నికల అనంతరం జరిగిన బదిలీలో భాగంగా ఆమె సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాలో విధులు నిర్వహించిన విజయలక్ష్మి శ్రీకాకుళం జిల్లాకు రిపోర్ట్ చేయడంతో ఆమెను సారవకోట మండల తహశీల్దారుగా నియమించారు.

## పింఛన్లు పంపిణీ ఏర్పాట్లు పూర్తి

నరసన్నపేట, జలుమూరు జూలై 31 (వార్త): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు ఒకటో తేదీన 90% పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని నరసన్నపేట ఎంపీడీవో జి.రామకృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే పంపిణీకి సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ క్రమంలో గ్రామలౌకు దురంగా వున్న వారు అందరు తమ గ్రామాలకు చేరుకోవాలి అని కోరారు. అలాగే ఉదయం లబ్ధిదారులు అంతా ఇళ్ల వద్దనే ఉండా లని ఆయన సూచించారు.



# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన జీవనం










**బూర్జ జూలై 31(వార్త):** ఆరోగ్యమే మహా భాగ్యం అంటారు. నేటి సమాజంలో ఆరోగ్యవంతులు ఎవరైనా ఉన్నారంటే వాస్తవానికి లేరనే చెప్పాలి. ప్రతి మనిషి పుట్టుకతోనే రోగాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనికి ప్రధాన కారణం రసాయన ఎరువులు, విషతుల్యమైన ఆహారం. టెక్నాలజీ పేరుతో వ్యవసాయాన్ని విషతుల్యం చేశాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు నాటి తెలుగుదేశం ప్రభుత్వం, సేంద్రీయ విప్లవ పితామహుడు సుభాష్ పాలేకర్ సహకారంతో 2017వ సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానాన్ని రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏపీ సీఎం అఫ్ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ మండలంలో ఎనిమిది గ్రామ సంఘాలలో అయిదు రైతు భరోసా కేంద్రాల పరిధిని ఒక యూనిట్‌గా తీసుకున్నారు.

పాలవలస యూనిట్లో ....

రెండు వందల ముప్పై మంది రైతులతో రెండు వందల అయిదు ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఈ రెండు వందల అయిదు ఎకరాల్లో పది ఎకరాల్లో కూరగాయలు 175 ఎకరాల్లో అపరాలు పది ఎకరాల్లో చెరకు పది ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పండిస్తున్నారు.

పాలవలస, కిలంత్రి గ్రామాలలో సుమారు ముప్పై మంది రైతులు ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు కూడా పండిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి పంటల్లో ఎటువంటి పురుగుమందులు వాడకుండా కషాయాలతో పండించడం జరుగుతుంది. ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ముందు నవధాన్యాలు పిఎండిఎస్ వేసి నలభై రోజుల తర్వాత దానిని దమ్ము చేసి వరి వేయడం జరుగుతుంది. ఈ పీఎండీఎస్ విధానం వల్ల భూమిలో సేంద్రీయ కర్బనం అధికంగా పెరుగుతుంది.

భూమి సారవంతమవడమే కాకుండా ఏదైతే ప్రధాన పంట వేస్తామో ఆ పంటకు పురుగులు, తెగుళ్ళు నుండి తట్టుకునే శక్తి వస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రతి పంటకు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నాటు ఆవు పేడతో తయారు చేసిన ద్రవజీవామృతాన్ని ఎరువుగా వేస్తారు. అనంతరం పురుగులు తెగుళ్లు సోకినా దానికి సంబంధించిన వేప, జిల్లేడు,ఉమ్మెత్త, గానుగ మొదలగు ఆకులతో కషాయాలను తయారుచేసి రామన్నపేటలో ఉన్న ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా రైతులకు అందించి పంటల్లో పిచికారీ చెయ్యడం జరుగుతుంది. ఇలా పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులకు పిజిఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ మండలంలో వంద మంది రైతులకు సిబ్బంది దగ్గరుండి చేయించారు. ఇలా పండించిన రైతు ఉత్పత్తులను తీసుకొని దానిని ప్రాసెసింగ్ చేయించి ఒక ఆర్గానిక్ దుకాణాన్ని కూడా సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ దుకాణం ద్వారా రైతుల నుంచి నేరుగా వినియోగదారుకు ఈ ఉత్పత్తులను అందించడం జరుగుతుంది ఇది కాకుండా పంటకు సంబంధించిన కషాయాలు దేశవాళి వరివిత్తనాలు, కూరగాయల విత్తనాలు అందించడం జరుగుతుంది.

ఆముదాలవలస మండలంలో నిమ్మతోర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన బెల్లం కలియుగ దైవమైన శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగిస్తున్నారు. ఈ ప్రకృతి వ్యవసాయాన్ని ఎలాంటి రసాయనిక ఎరువులూ లేకుండా ఒక దేశవాళీ ఆవుతో ముప్పై ఎకరాల వరకు సాగు చెయ్యవచ్చు. ఒక గ్రాము దేశవాళీ ఆవు పేడలో పంటకు పనికొచ్చే 300 కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ పేడను ఉపయోగించి వాడే ఘన, ద్రవ జీవామృతాలలో అనేక కోట్ల సూక్ష్మజీవులు భూమిపై పడిన వెంటనే భూమిలో ఉన్న పోషకాలు మొక్కకు అందించి మొక్క పెరుగుదలకు ప్రధానపాత్ర వహిస్తాయి.

ఈ విధంగా ప్రకృతి వ్యవసాయం చేసి నేల తల్లి ఆరోగ్యం కాపాడుతూ మనిషి జీవన ప్రమాణాలను మెరుగు పరచవచ్చు.



రైతులకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేయించడం జరుగుతుంది. నేను రెండు ఎకరాల్లో తుద్దలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ప్రధాన పంటతో పాటు గట్లపై కూరగాయలు పంటలు వేస్తూ ఏ గ్రేడ్ విధానంలో చేయడం జరుగుతుంది.

గురువు జగన్
యూనిట్ ఇంచార్జ్, బూర్జ



నేను రైల్వేలో ఉద్యోగం చేస్తూ పది ఎకరాలలో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్స్ పండించడం జరుగుతుంది. దీనివలన సమాజానికి ఆరోగ్యకరమైన పండ్లను అందిస్తున్న సంతృప్తి కలగటంతోపాటు, అధిక లభాలను ఆర్జిస్తున్నాను.

పప్పల రామ్మోహన్ రావు
డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతు.



ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి ఆరోగ్యంతో వండడం పాటు మన ఆరోగ్యం బాగుపడుతుంది. రైతులందరూ ఈ విధానాన్ని పాటించి ఆరోగ్యాన్ని ఆదాయాన్ని పొందుతారని సూచించడం జరిగింది.

ధనంజయరావు
అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్
శ్రీకాకుళం



నేను 2 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పచ్చిరొట్టకాయతోపాటు 18 రకాల విత్తనాలు వేసి భూమిలో కలియదున్ని సాగు చేయడం జరుగుతుంది. గట్లపై మునగ, అరటి కరివేపాకు, కూరగాయలు పంటలు సాగు చేస్తున్నాను. దీనివల్ల నాకు చాలా ఆదాయం వస్తుంది.

సవిరిగాన రమేష్
రైతు, పాలవలస



జిల్లాలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయించి మార్కెటింగ్ సదుపాయం కల్పించడం జరుగుతుంది. వివిధ మండల జిల్లా కేంద్రాలలో స్టాల్స్ ఏర్పాటు చేసి మరింత అవగాహన పెంపొందించడం జరుగుతుంది.

సిహెచ్ చిన్నమ్మడు
మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్, బూర్జ

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413